'ఆలయంలో బీఆర్‌ఎస్ నాయకులు అవమానించారు'

రాంగోపాల్‌పేట్: సికింద్రాబాద్ ఉజ్జయినీ మహంకాళి దేవాలయంలో బీఆర్‌ఎస్ నాయకులు తనను అవమానించారని ఉత్సవ కమిటీ సభ్యులు శ్రీకాంత్‌చారి ఆవేదన వ్యక్తం చేశారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం అధికారంలో లేకున్నా తమ ఆధిపత్యమే నడువాలనే ఉద్దేశ్యంతో దేవాలయంలో రాజకీయాలు చేస్తున్నారని ఆయన అన్నారు. ఆదివారం బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు బోనాలు సమర్పించేందుకు దేవాలయానికి వచ్చారని అదే సమయంలో తాను ఈవో చాంబర్‌లో కూర్చుని ఉండగా బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన మహేష్ యాదవ్.. ఇక్కడ నీకేమి పని.. మా వాళ్లు వస్తున్నారు ఇక్కడి నుంచి బయటకు వచ్చెయ్ అంటూ బలవంతగా చెయ్యి పట్టుకుని లాక్కుని వచ్చారని ఆవేదన వ్యక్తం చేశారు. పోలీసులు వారిస్తున్నా పట్టించుకోకుండా తనను బయటకు తీసుకుని వచ్చారన్నారు. ఈవో మనోహర్‌రెడ్డికి దీనిపై ఆయన ఫిర్యాదు చేశానని దీనిపై తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారని శ్రీకాంత్‌చారి చెప్పారు.

అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే


అమ్మవారి ఘటానికి పూజలు చేస్తున్న ఎమ్మెల్యే శ్రీగణేష్

రాంగోపాల్‌పేట్: తెలంగాణ సంస్కృతికి, సంప్రదాయాలకు ప్రతీకగా బోనాల ఉత్సవాలను నిలుస్తాయని కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ అన్నారు. ఆదివారం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు అల్లాడి గౌరిశంకర్ ఆధ్వర్యంలో రెజిమెంటల్‌బజార్‌లోని గండిమైసమ్మ దేవాలయ ఘటాల అలంకరణోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఘటాన్ని పూలతో ముస్తాబు చేసి ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన అమ్మవారిని దర్శించుకన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు బద్రీనాథ్ యాదవ్, బాబూరావు ముదిరాజ్, నందికంటి రవి పాల్గొన్నారు.

ఉత్సాహంగా గోరింటాకు పండగ



లాలాపేట: భారతీయులు ఎక్కడున్నా సంస్కృతి సంప్రదాయాలను కాపాడుతూనే ఉంటారని తార్నాకకు చెందిన ఆత్మీయ మహిళా మండలి అధ్యక్షురాలు డాక్టర్ లక్కరాజు నిర్మల అన్నారు. ఈ మేరకు ఆమెరికా పర్యటనలో ఉన్న డల్లాస్‌లో జరిగిన మెహింది పంక్షన్‌లో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. సంస్కృతిని తెలిపే పాటలు పాడుతూ ఆడుతూ సందడి చేశారు. తెలుగు వాళ్లు జరుపుకునే గోరింటాకు వేడుకల ప్రాధాన్యతను వారికి వివరించారు.

నేటి సచివాలయ ముట్టడికి టీఎస్‌పీ మద్దతు

ఉస్మానియా యూనివర్సిటీ: బీసీ డిక్లరేషన్ అమలుకు నేడు (15న) వివిధ సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించతల పెట్టిన సచివాలయ ముట్టడికి తెలంగాణ స్టూడెంట్స్ పరిషత్ (టీఎస్‌పీ) మద్దతు ప్రకటించింది. ఆదివారం టీఎస్‌పీ రాష్ట్ర అధ్యక్షులు బారి అశోక్ కుమార్ యాదవ్ మాట్లాడుతూ విద్యార్థులు వివిధ విద్యార్థి సంఘాలు, నిరుద్యోగ, బీసీ సంఘాలు చేపట్టిన సచివాలయ ముట్టడిలో టీఎస్‌పీ నాయకులు పాల్గొంటరని పేర్కొన్నారు. కుల గణన చేపట్టి బీసీలకు 42 శాతం రిజర్వేషను కల్పించి స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని అశోక్‌కుమార్ యాదవ్ డిమాండ్ చేశారు.

జైళ్ల శాఖలో వార్డర్స్ బదిలీలను నిలిపివేయాలి

లాలాపేట: తెలంగాణ రాష్ట్రంలో జైళ్ల శాఖలో చేపట్టబోయే వార్డర్స్, బగ్లర్స్ బదిలీలను వెంటనే నిలిపివేయాలని దక్షిణ భారత రాజకీయ జేఏసీ చైర్మెన్ ప్రొ గాలి వినోద్‌కుమార్ డిమాండ్ చేశారు. ఆదివారం పలువురు వార్డర్స్ ఉద్యోగులు ఆయనను కలిసి సమస్యను చెప్పుకున్నారు. ఈ సందర్భంగా ఉద్యోగుల సమస్యలపై ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో గాలి వినోద్‌కుమార్ మాట్లాడుతూ.. భారత రాష్ట్రపతి ఉత్తర్వుల మేరకు ఉమ్మడి రాష్ట్రంలో రాష్ట్ర స్థాయి క్యాడర్‌గా ఉన్న వార్డర్స్ బగ్లర్స్‌ను తెలంగాణలో జిల్లా క్యాడర్‌గా మార్చి 2021 డిసెంబర్ 6న వివిధ జిల్లాలకు బదిలీ చేశారని పేర్కొన్నారు. అందుకు విరుద్ధంగా కాంట్రిజియస్ జీవో 54 ప్రకారం చేపట్టనున్న ఈ బదిలీలను ఆపాలన్నారు.

వర్సిటీల గ్రంథాలయాలకు ప్రత్యేక నిధులు కేటాయించాలి

ఉస్మానియా యూనివర్సిటీ: రాష్ట్రంలోని యూనివర్సిటీల గ్రంథాలయాలకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక నిధులు కేటాయించాలని వివిధ విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం తెలంగాణ గ్రంథాలయ పరిషత్ చైర్మనగా పదవీ బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ రియాజ్‌కు ఓయూ విద్యార్థి నాయకులు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో ఓయూ జేఏసీ చైర్మన్ కొత్తపల్లి తిరుపతితో పాటు కోట శ్రీనివాస్‌గౌడ్, వలిగొండ నరసింహ, ఏఐఎస్‌ఎఫ్ నాయకులు స్టాలిన్, శివశంకర్, రాజేందర్ మహేందర్ తదితరులు పుష్పగుచ్చాన్ని అందచేసి అభినందనలు తెలిపారు.

చదువే మా లోకం..ఉద్యోగమే లక్ష్యం



ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూలో వివిధ ఉద్యోగాల పోటీ పరీక్షల ఫీవర్ నెలకొంది. డీఎస్సీ, గ్రూప్–1, 2, 3లతో పాటు ఇతర ఉద్యోగాల రాత పరీక్షలకు నిర్విరామంగా చదవుతున్నారు. రోజుకు పది నుంచి 12 గంటల వరకు పోటీ పరీక్షల పుస్తకాలను చదువుతున్నారు. పేద కుటుంబాలకు ఉద్యోగమే సంపద అని ఈ సందర్భంగా పలువురు విద్యార్థులు పేర్కొన్నారు.

అంబేడ్కర్‌కు జ్ఞానమాల సమర్పణ



లాలాపేట: తార్నాకలోని చింతల్ బస్తీలో ఉన్న డా. బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి బస్తీ నాయకులు తుంగ లక్ష్మణ్ ఆధ్వర్యంలో జ్ఞానమాల వేసి నివాళులర్పించారు. కొంత కాలంగా ప్రతి వారం అంబేడ్కర్ విగ్రహానికి జ్ఞానమాల సమర్పణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో అక్రమ్, చిన్నా, చింతల్ బస్తీ వాసులు పాల్గొన్నారు.

వారలా.. వీరిలా..!

- ఇంకా ప్రారంభం కాని పనులు
- శంకుస్థాపనలకే పరిమితమైన ప్రధాన అభివృద్ధి కార్యక్రమాలు
- ఎన్నికల ముందు హడావిడిగా బీఆర్‌ఎస్ ప్రభుత్వం శంకుస్థాపనలు
- పట్టించుకోని కాంగ్రెస్ పార్టీ


ఆర్‌యూబీ నిర్మించే ప్రాంతం

సనత్‌నగర్: ఎన్నికల ముందు గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో సనత్‌నగర్‌లో చేపట్టిన అభివృద్ధి పనులు ఇంకా పట్టాలెక్కలేదు. కొత్త ప్రభుత్వం కొలువుదీరి ఏడు నెలలు దాటినా ఇప్పటికీ వాటి ఊసే లేదు. అసలు ఆయా పనులు ముందుకుసాగుతాయా? లేదా? అన్నది ప్రశ్నార్థకంగా మారింది. గతంలో అధికారంలో ఉన్న బీఆర్‌ఎస్‌పార్టీ పలు అభివృద్ధి పనులకు ఎన్నికల ముందు ఆఘమేఘాల మీద శంకుస్థాపన కార్యక్రమాలు నిర్వహించింది. అనంతరం వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇపుడు వాటి గురించే ఆలోచించడం లేదు. అసలు ఆ పనులు చేపడతారా? లేదా అని పలువురు ప్రశ్నిస్తున్నారు.

అడుగు ముందుకు పడని ఆర్‌యూబీ నిర్మాణం

రోజు రోజుకూ పెరుగుతున్న ట్రాఫిక్ అవసరాలను దృష్టిలో పెట్టుకుని సనత్‌నగర్ ఇండస్ట్రియల్ ఏరియా నుంచి రైలు పట్టాల కిందుగా ఆర్‌యూబీ నిర్మాణం చేపట్టి బాలానగర్ నర్సాపూర్ చౌరస్తాకు అనుసంధానం చేయాలని గత ప్రభుత్వ హయాంలో ప్రతిపాదించారు. ఆర్‌యూబీ నిర్మాణం కోసం రైల్వే శాఖకు కూడా జీహెచ్‌ఎంసీ నుంచి నిధులు చెల్లించినట్లుగా అప్పటి బీఆర్‌ఎస్ పాలకులు చెప్పారు. అయితే ఇంతవరకు ఈప్రాజెక్టు నిర్మాణానికి ఒక్క అడుగు కూడా ముందుకుపడలేదు.

- హైదరాబాద్ రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (హెచ్‌ఆర్‌డీసీఎల్), రైల్వే శాఖలు సంయుక్తంగా ఈ ప్రాజెక్టు నిర్మాణం చేపట్టాలి. అందుకోసం సర్వే కూడా పూర్తి చేసి మొత్తం 2.34 కిలోమీటర్ల మార్గంలో 600 మీటర్ల మేర రైలు పట్టాల కిందుగా నగరంలోనే అతి పొడవైన ప్రాజెక్టుగా అండర్‌పాస్ నిర్మాణం జరపాలని ప్రణాళికలు రూపొందించారు.
- మొత్తం నాలుగు లేన్లుగా సనత్‌నగర్ పారిశ్రామికవాడ నుంచి సనత్‌నగర్–ఫతేనగర్ రైల్వే లైన్ల కిందుగా నిర్మించే అండర్‌పాస్ బ్రిడ్జి పనులను గతంలో మంత్రులుగా ఉన్న కేటీఆర్, తలసాని శ్రీనివాస్‌యాదవ్‌లు ప్రారంభించారు. మొత్తం రూ.68.30 కోట్ల ప్రాజెక్టు వ్యయంలో సుమారు రూ.40 కోట్లను రైలు పట్టాల కిందుగా అండర్‌పాస్ నిర్మించడం కోసం రైల్వేశాఖకు కేటాయించారు.
- సికింద్రాబాద్–ముంబాయి లైన్‌లో ఉన్న ఏడు రైలు పట్టాల కిందుగా అండర్‌పాస్ నిర్మాణం చేపట్టాల్సి ఉంది. ఆర్‌యూబీ నిర్మాణం పూర్తయితే సనత్‌నగర్ నుంచి నర్సాపూర్ చౌరస్తాకు కేవలం ఐదు నిమిషాల్లో, మరోవైపు ఎర్రగడ్డ నుంచి బాలానగర్‌కు 10 నిమిషాల వ్యవధిలోనే చేరుకునే వెసులుబాటు కలుగుతుంది.

ఫతేనగర్ బ్రిడ్జి విస్తరణ జరిగేనా..

ప్రస్తుత వాహన విస్ఫోటనానికి ఏమాత్రం ఫతేనగర్ బ్రిడ్జి అవసరాలను తీర్చలేకపోతుంది. మేడ్చల్, హైదరాబాద్ జిల్లాకు అనుసంధానంగా ఉన్న ఈ బ్రిడ్జిపై వాహన ఒత్తిడి అంతకంతకూ పెరుగుతోంది.

- మూడు దశాబ్దాల క్రితం ముందస్తు ఆలోచన లేకుండా ఈ బ్రిడ్జి నిర్మాణం చేపట్టారు. జీడిమెట్ల, షాపూర్‌నగర్, బాలానగర్ ప్రాంతాల నుంచి ఫతేనగర్, బల్కంపేట మీదుగా అమీర్‌పేట, ఎర్రగడ్డ వైపు వచ్చేవారికి దగ్గరి దారి కావడంతో ఎక్కువ శాతం ఫతేనగర్ బ్రిడ్జిని ఆశ్రయిస్తుంటారు.
- ఈ క్రమంలో ఈ బ్రిడ్జి విస్తరణకు గత ప్రభుత్వం ప్రతిపాదించి శంకుస్థాపన కూడా చేసింది. ఈ ప్రాజెక్టులోనూ ఇసుమంతైనా కదలిక లేదు. బ్రిడ్జి విస్తరణ జరగాలంటే ఫతేనగర్ వైపు కొన్ని ఆస్తులు స్వాధీనం చేసుకోవాల్సి ఉంటుంది.
- ఆ ప్రక్రియ కూడా ఇంతవరకు చేపట్టలేదు. గత ప్రభుత్వంలో శంకుస్థాపనకు నోచుకున్న ఈ బ్రిడ్జి విస్తరణ అసలు జరుగుతుందా? లేదా? అనేది వేచిచూడాలి.

ఈఎస్‌ఐ శ్మశానవాటిక ఆధుకీకరణ హుష్‌కాకేనా..?

ఈఎస్‌ఐ శ్మశానవాటికను ఆధునీకీకరించాలని గత ప్రభుత్వం రూ.3 కోట్లు కేటాయించింది. కానీ ప్రభుత్వం దీనిపై కూడా అంతగా దృష్టిపెట్టినట్లు కనిపించడం లేదు.

- ఒక్క రూపాయి కూడా ఇంతవరకు మంజూరు చేయలేదు. దీంతో పాటు గత ప్రభుత్వ హయాంలో చేపట్టిన బేగంపేట ముస్లిం గ్రేవ్ యార్డు అభివృద్ధి పనులు కూడా మధ్యలోనే నిలిచిపోయాయి. ఈ పనులకు నిధులు మంజూరవుతాయా లేదా చూడాలి.


విస్తరణకు నోచుకోని ఫతేనగర్ బ్రిడ్జి

ఉత్సాహంగా వనమహోత్సవం

సనత్‌నగర్: పర్యావరణ పరిరక్షణపై జెక్‌కాలనీ నివాసితులు కదం తొక్కారు. ప్రాణకోటికి జీవనాధారమైన మొక్కలను నాటి కాపాడుకోవాలంటూ నినదించారు. కేఎస్‌రాజు ఛారిటబుల్ ఫౌండేషన్, విశ్వ మానవ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం జెక్‌కాలనీలో వన మహోత్సవం పేరిట మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. ఇందుకు జెక్‌కాలనీ రెసిడెంట్స్ వెల్ఫేర్ ఫెడరేషన్ తన సహకారాన్ని అందించింది. ముందుగా మొక్కలు నాటి అనంతరం కాలనీ వీధుల్లో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కేఎస్ రాజు ఛారిటబుల్ ఫౌండేషన్ చైర్మన్ కే సుబ్బరాజు, విశ్వ మానవ సంక్షేమ సంఘం అధ్యక్షుడు వెంకట్ సోమ, జెక్‌కాలనీ ఫెడరేషన్ అధ్యక్షుడు మల్లు ప్రసాద్‌లు మాట్లాడుతూ భవిష్యత్తు తరాలకు కాలుష్య రహిత సమాజాన్ని అందించడం మనందరి బాధ్యత అన్నారు. కార్యక్రమంలో దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ అన్నపూర్ణ, బాలానగర్ ట్రాఫిక్ సీఐ సురేష్, కాలనీ ప్రతినిధులు సీహెచ్.అనంతరెడ్డి, కంజర్ల సదాశివయాదవ్, శివారెడ్డి, శ్రీహరి, నాగిరెడ్డి, రామ సుబ్బారెడ్డి, డీఎస్‌రావు, లక్ష్మారెడ్డిలతో పాటు నాగమణి, వాణి, హైమావతి తదితరులు పాల్గొన్నారు.


వన మహోత్సవంలో మొక్కలు నాటుతున్న జెక్‌కాలనీ వాసులు

గ్రూప్–1 ప్రిలిమ్స్ ఫలితాల్లో రిజర్వేషన్ అభ్యర్థులకు అన్యాయం

ఉస్మానియా యూనివర్సిటీ: గ్రూప్–1 ప్రిలిమ్స్ పరీక్షా ఫలితాల్లో రిజర్వేషన్ అభ్యర్థులకు అన్యాయం జరిగిందని బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షులు స్వామిగౌడ్ ఆదివారం పేర్కొన్నారు. బీఆర్‌ఎస్ హయాంలో కొనసాగిన జీవో 55 రద్దు చేసి కాంగ్రెస్ ప్రభుత్వం కొత్తగా తెచ్చిన జీవో నంబర్ 29తో ప్రిలిమ్స్ ఫలితాల్లో రిజర్వేషన్లు పాటించలేదన్నారు. ఫలితాల్లో కేటగిరీల వారిగా ర్యాంకింగ్‌లను, కటాఫ్ మార్కులను పెట్టకుండా ఫలితాలను విడుదల చేయడం వలన ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈడబ్ల్యూసీ అభ్యర్థులకు నష్టపోయరన్నారు. రిజర్వేషన్లు పాటిస్తే మరో 10, 450 మంది అభ్యర్థులు గ్రూప్–1 మెయిన్స్ ఎంపికకు అర్హత సాధిస్తారని పేర్కొన్నారు. మొత్తం 563 పోస్టుల్లో 209 ఓపెన్ కేటగిరీ కాగా అందులో ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈడబ్ల్యూసీ, రిజర్వ్‌డ్ అభ్యర్థులకు కూడా అవకాశం ఉంటుందన్నారు.

ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్‌కు సత్కారం



అమీర్‌పేట: రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ నగరిగారి ప్రీతంను మెథడిస్ట్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు ఘనంగా సన్మానించారు.ఆదివారం ప్రీతంను ఆయన నివాసంలో కలిసి సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో కోహీర్ మెథడిస్ట్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు గాబ్రియేల్, సభ్యులు దాస్ తదితరులు పాల్గొన్నారు.

పేలిన ఆర్టీసీ బస్సు టైర్.. తప్పిన ప్రమాదం

బన్సీలాల్‌పేట్: సికింద్రాబాద్ ఆర్పీ రోడ్ బైబిల్ హౌస్ ప్రాంతంలో ఆదివారం సాయంత్రం రైల్వే బ్రిడ్జి కింద ఫలక్‌నుమా డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు టైర్ పేలిపోయింది. బస్సు అదుపు తప్పి రైల్వే బ్రిడ్జి గార్డుకు ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగినట్లు తెలుస్తోంది. బస్సు సికింద్రాబాద్ నుంచి చార్మినార్ వైపు వెళ్తుండగా ఆర్పీ రోడ్డులోని బ్రిడ్జి కింద ప్రమాదానికి గురైంది. డ్రైవర్ బ్రిడ్జి కింది భాగం సరిగా చూసుకోకపోవడం కారణంగా అక్కడే ఉన్న గార్డర్ దిమ్మెకు ఢీకొనడంతో టైర్ పేలిపోవడంతో ప్రయాణికులు భయాందోళనతో బస్సులో నుంచి బయటకు దిగి పరుగు తీశారు. సాయంత్రం 4 నుంచి రాత్రి 7గంటల వరకు కూడా బ్రిడ్జి కింద బస్సు నిలిచిపోవడంతో రాకపోకలకు అంతరాయం కలిగింది. అనంతరం మహంకాళి ట్రాఫిక్ పోలీసులు ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

ఇంగ్లిష్ నేర్పించండి సర్

ఓయూలో మూతపడ్డ ఆంగ్ల శిక్షణా కేంద్రాలు


ఆర్ట్స్ కాలేజీలోని ఈఎల్‌టీ సెంటర్


ఇంజనీరింగ్ కాలేజీలోని సెల్ట్‌లో ఏర్పాటు చేసిన ఇంగ్లిష్ ల్యాబ్

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూలోని ఇంగ్లిష్ భాష శిక్షణ కేంద్రాలు పడకేశాయి. యూనివర్సిటీ క్యాంపస్‌లో కాలేజీలో బోధన, పరిశోధన విద్య పూర్తిగా ఇంగ్లిష్‌లోనే ఉంటుంది. గ్రామీణ, పట్టణ ప్రాంతాలలో తెలుగు మీడియంలో చదివిన విద్యార్థులు ఇంగ్లిష్ భాషతో ఇబ్బంది పడకూడదని ఓయూ ఆర్ట్స్, ఇంజనీరింగ్ కాలేజీల ఇంగ్లిష్ విభాగాలకు అనుబంధంగా ప్రత్యేకంగా భాషా శిక్షణ కేంద్రాలను ఏర్పాటు చేశారు. నామ మాత్రపు ఫీజుతో కొనసాగిన ఇంగ్లిష్ భాషలో శిక్షణ కేంద్రాల్లో విదేశీ విద్యార్థులు సైతం ఆంగ్లభాషను నేర్చుకున్నారు. ఇంజనీరింగ్, ఎంఏ, ఎంకాం, ఎమ్మెస్సీ, ఎంబీఏ, బీఈడీ, ఎంఈడీ, ఎంపీఈడీ, ఎల్‌ఎల్‌బీ, ఎల్‌ఎల్‌ఎం, ఇతర పీజీ కోర్సులు క్యాంపస్ కాలేజీల్లో చదివే విద్యార్థులు ఇంగ్లిష్‌లో మాట్లాడటం, రాయడం, చదవడం కోసం ఆర్ట్స్ కాలేజీ, ఇంజనీరింగ్ కాలేజీలో ప్రత్యేకంగా శిక్షణ కేంద్రాలను ఏర్పాటు చేశారు. కానీ వివిధ కారణాల వలన మూతపడ్డాయి. సదుద్దేశ్యంతో ఏర్పాటు చేసిన ఇంగ్లిష్ శిక్షణా కేంద్రాలను పునః ప్రారంభించి ఉపయోగపడేలా చూడాలని పలువురు విద్యార్థులు కోరుతున్నారు.

ఫిజికల్ డైరెక్టర్లకు పదోన్నతి ఇవ్వాలి


ప్రొ.కోదండరాంకు వినతి పత్రం అందజేస్తున్న ఫిజికల్ డైరెక్టర్స్ అసోసియేషన్ నాయకులు

లాలాపేట: రాష్ట్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో దీర్ఘకాలికంగా పని చేస్తున్న ఫిజికల్ డైరెక్టర్లు, లైబ్రేరియన్లకు పదోన్నతులు ఇవ్వాలని తెలంగాణ జూనియర్ కాలేజ్ ఫిజికల్ డైరెక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షులు బి. లక్ష్మయ్య, ప్రధాన కార్యదర్శి పర్వతాలు గౌడ్ డిమాండ్ చేశారు. ఆదివారం తార్నాకలో తెలంగాణ జనసమితి అధ్యక్షులు ప్రొ. కోదండరాంను కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. ఫిజికల్ డైరెక్టర్లు, లైబ్రేరియన్ల ప్రమోషన్ల సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. దాదాపు 20 , 30 ఏళ్ల నుంచి సర్వీసు చేసినా ఎలాంటి ప్రమోషన్లు లేకుండానే పదవీ విరమణ అవుతున్నారని తెలిపారు. సానుకూలంగా స్పందించిన కోదండరాం ప్రభుత్వంతో చర్చిస్తామన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు బాల్‌రాజు, జక్కయ్య ప్రసాద్, జగన్ మోహన్ తదితరులున్నారు.

సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన

రసూల్‌పురా: అభివృద్ధి చేయడమంటే కాంగ్రెస్ నాయకుడిలా ఫ్యాషన్ షో చేసి ఫోటోలకు ఫోజులివ్వడం కాదని కంటోన్మెంట్ బోర్డు నామినేటెడ్ సభ్యులు రామకృష్ణ అన్నారు. ఆదివారం బోర్డు మూడవ వార్డు కార్ఖానా గణేష్ టెంపుల్ సమీపంలో బోర్డు నిధులతో చేపట్టే సీసీ రోడ్డు పనులకు రామకృష్ణ ముఖ్య అతిథిగా హాజరై శంకుస్థాపన చేశారు . ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం నుంచి నిధులు తీసుకవచ్చి ప్రజా సమస్యలు పరిష్కరించాలని అన్నారు. ప్రధాని మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం పూర్తి సహాయ సహకారాలు అందించి నిధులు కేటాయిస్తోందని కేంద్ర ప్రభుత్వ నిధులతోపాటు బోర్డు నిధులతో కంటోన్మెంట్‌లో అభివృద్ధి జరుగుతోందన్నారు. కార్యక్రమంలో విజయానంద్ నర్సింగ్ రావు, వంశతిలక్ పాల్గొన్నారు.


సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న రామకృష్ణ

ఉచిత వైద్య శిబిరాలు సద్వినియోగం చేసుకోవాలి


ఉచిత దంత వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శ్రీగణేష్

రసూల్‌పురా: ఉచిత వైద్య శిబిరాలను పేదలు సద్వినియోగం చేసుకోవాలని కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీ గణేష్ కోరారు. ఆదివారం కార్ఖాన దర్గా లాల్‌షా మైదానంలో డాక్టర్ గొల్లపూడి అమర్ ప్రసాద్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత దంత వైద్య శిబిరాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డాక్టర్ అమర్ ప్రసాద్ ఆధ్వర్యంలో మరిన్ని వైద్య శిబిరాలు పేదలు నివసించే బస్తీల్లో ఏర్పాటు చేసి సేవలందించాలని కోరారు. కార్యక్రమంలో మహ్మద్ హరుణ్, మీర్జా గౌస్ పాల్గొన్నారు.

వాన.. వరద

సెలవు రోజు ఆదివారం సాయంత్రం నగరంలో వర్షం దంచికొట్టింది. సరదాగా బయటకు వచ్చిన నగర వాసులు ఇబ్బందులు పడ్డారు. భారీ వర్షంతో నగరం అతలాకుతలమైంది. ప్రధాన రహదారులు గోదారులయ్యాయి. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి.

సనత్‌నగర్: ఆదివారం సాయంత్రం నగరంలో భారీ వర్షం కురిసింది. వర్షానికి అమీర్‌పేట ప్రధాన రహదారి చెరువును తలపిస్తూ వరద నీరు భారీగా చేరింది. ఈ క్రమంలో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ముఖ్యంగా మైత్రీవనం చౌరస్తా, చర్మాస్ చౌరస్తా, ఈఎస్‌ఐ, ఎర్రగడ్డ మెట్రో స్టేషన్ల వద్ద భారీగా వరదనీరు చేరడంతో ట్రాఫిక్ స్తంభించింది. దీంతో పాటు బేగంపేట ప్రధాన రహదారిలోని ప్రకాష్‌నగర్ మెట్రో స్టేషన్ వద్ద వరదనీరు భారీగా చేరడంతో తటాకాన్ని తలపించింది. స్టాపర్‌స్టాప్ సమీపంలోని పెట్రోల్‌బంకులోకి నీరు చేరింది. దీంతో ఈ మార్గంలో ఎక్కడి వాహనాలు అక్కడే నిలిచిపోయి కిలోమీటర్ల మేర ట్రాఫిక్ స్తంభించింది. బేగంపేట చీకోటిగార్డెన్, మయూరిమార్గ్, అల్లం తోటబావి, బ్రాహ్మణవాడీ, ప్రకాష్‌నగర్ ఎక్స్‌టెన్షన్ ప్రాంతాలు బల్కంపేట–బేగంపేట లింక్ రోడ్డు ప్రాంతాలు నీటమునిగాయి. భారీ వర్షంతో కరెంటు సరఫరాలో అంతరాయం ఏర్పడింది. ఒకవైపు రోడ్లపై భారీగా చేరిన వరద, ఇంకో వైపు అంధకారంతో జనం నానా అవస్థలు పడ్డారు.

పొంగిప్రవహించిన నాలాలు

చిలకలగూడ : లష్కర్‌లోని పలు ప్రాంతాల్లో ఆదివారం రాత్రి భారీవర్షం దంచికొట్టింది. లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. నాలాలు పొంగి ప్రవహించడంతో పరీవాహక ప్రాంత ప్రజలు భయాందోళనకు గురయ్యారు. పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. చిలకలగూడ కట్టమైసమ్మ ఆలయంలోకి వరద నీరు చేరడంతో ఆలయప్రాంగణంలోని దేవతా మూర్తుల విగ్రహాలు, హోమగుండం నీటిలో మునిగి పోయాయి. ఆలయ ఈఓ మహేందర్‌గౌడ్ ట్రస్టీబోర్డు చైర్మన్ గుంటి కృష్ణలు వరదనీటిని బయటకు పంపిచేందుకు కృషి చేశారు. సీతాఫల్‌మండి ఇందిరానగర్ రోడ్ నంబరు 3లో భారీ చెట్టు కూకటి వేళ్లతోసమా నేలకొరిగింది. సీతాఫల్‌మండి కార్పొరేటర్ అందించిన సమాచారంతో డిజాస్టర్ సిబ్బంది ఘటనస్థలానికి చేరుకుని చెట్టు కొమ్మలను కట్ చేసి తొలగించారు. సికింద్రాబాద్ ఎమ్మెల్యే పద్మారావుగౌడ్ ఆదేశాల మేరకు జీహెచ్‌ఎంసీ, డిజాస్టర్ టీమ్‌లు నియోజకవర్గ పరిధిలో పర్యటిస్తున్నాయి. వాటర్ లాగింగ్ పాయింట్లను గుర్తించి, వరదనీరు సాఫీగా వెళ్లేలా చర్యలు చేపట్టారు.


లాలాపేట సత్యానగర్‌లో..

తార్నాక, లాలాపేటలో భారీ వర్షం

లాలాపేట: తార్నాక, లాలాపేట ప్రాంతాల్లో ఆదివారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. తార్నాక చౌరస్తా, లాలాపేట అంబేడ్కర్ విగ్రహం , రామ్‌థియేటర్ ఎదురుగా ఉన్న ఆర్టీసి బస్ షెల్టర్ వద్ద వరద నీరు భారీగా చేరింది. లాలాపేటలోని పలు లోతట్టు ప్రాంతాలైన సత్యానగర్, లక్ష్మీనగర్, శ్రీపురి కాలనీ, చంద్రబాబునగర్, వినోభానగర్, మాణికేశ్వర్‌నగర్‌లలో రోడ్లన్నీ జలమయమైనాయి. నాలాలు, మ్యాన్ హోళ్లు పొంగి పొర్లాయి. లాలాపేటలోని ఓపెన్ నాలా ఉధృతంగా ప్రవహిస్తోంది. తార్నాక, లాలాపేట ప్రధాన రహదారిలో ట్రాఫిక్ జాం అయింది. కొన్ని ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో ఆంతరాయం కల్గింది.

లోతట్టు ప్రాంతాలు జలమయం

రాంగోపాల్‌పేట్: ఆదివారం సాయంత్రం సికింద్రాబాద్‌లోని వివిధ ప్రాంతాల్లో భారీ వర్షం కురిసింది. దాదాపు గంట పాటు కురిసిన వర్షంతో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. రెజిమెంటల్‌బజార్, 31 బస్టాప్, పార్క్‌లేన్, నల్లగుట్టలోని కొన్ని ప్రాంతాల్లో వరద నీరు ముంచెత్తింది. రెజిమెంటల్‌బజార్‌లోని గురుద్వారా పక్క గల్లీలో పెద్ద ఎత్తున వరద నీరు వచ్చి చేరింది. ఈ గల్లీ నుంచి వర్షం నీరు వెళ్లే దారిలేకపోవడంతో ఇక్కడ ఉండే ఇళ్లలోకి వరద నీరు వచ్చి చేరింది. గల్లీలో పార్కు చేసిన కార్లు, ద్విచక్ర వాహనాలు నీటిలో మునిగిపోయాయి. స్థానికులు జీహెచ్‌ఎంసీ అధికారులకు ఫోన్‌లు చేసినా స్పందించడం లేదని వాపోయాయి.


లాలాపేటలో..


చిలకలగూడ కట్టమైసమ్మ ఆలయంలో వరదనీరు